క్లుప్తంగా

పాఠశాలల్లో సమావేశాలు



ప్రగతి పత్రాలతో విద్యార్థులు

పెంచికల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను బుధవారం నిర్వహించారు. విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందచేశారు. ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించడంతో స్థానిక కేజీబీవీ వద్ద విద్యార్థినిలు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయండి

కెరమెరి: ఇందిరమ్మ గృహాల నిర్మాణాల కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు 5433 ఇళ్లు మంజూరు చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 270 ఇళ్ల మంజూరు అయ్యాయని తెలిపారు. ఎంపిక ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఎంఈవో

కెరమెరి: ఇంటర్మీడియట్‌లో 942 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిని సాంగ్వి గ్రామానికి చెందిన కొట్రంగే రుక్మాబాయి తల్లిదండ్రులు పాపయ్య, లక్ష్మీబాయిలను బుధవారం మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ స్వీట్లు తినిపించి, శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డురా దని కేజీబీవీ మోడిలో చదువుతున్నరు క్మాబాయి నిరూపించందని అన్నారు. పదిలోనూ మండల టాపర్‌గా నిలిచి ఇప్పుడు ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, సాంగ్వి హెచ్‌ఎం సోము పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

రెబ్బెన: సింగరేణి మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ జీఎంగా విధులు నిర్వహిస్తూ ఈనెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న మల్లెల సుబ్బారావును బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి సన్మానించారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా పర్యటనలో భాగంగా ఏరియాకు వచ్చిన ఆయనకు ఏరియా జీఎంతో పాటు అధికారులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా జీఎం కార్యాలయంలో శాలువాతో సన్మానించి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో కైరిగూడ ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం ఉమాకాంత్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు


ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడి, పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాధన సూరుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా చెల్లూరుకు చెందిన చింతకింది సుదర్శన్ బృందం మూఢ నమ్మకాలపై విన్యాసాలు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించడం తమ కుల వృత్తిగా మార్చుకున్నామన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూదానం

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలం గోయెగాం పంచాయతీ పరిధిలోని చిన్నుపటేల్ గూడకు చెందిన దుర్వ ముకుంద్‌రావు గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి భూమిని దానంగా ఇచ్చారు. ముకుందరావుకు చెందిన సర్వే నంబర్ 20లో 0.0183 గుంటల భూమిని పాఠశాలకు రాసి ఇచ్చారు. బడీడు పిల్లలు నష్టపోకుండా ఉండాలని భూదానం చేసినట్లు దాత తెలిపారు. కాగా, చిన్నుపటేల్ గూడలో గిరిజన ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేయాలని గ్రామస్తులు బుధవారం ఉట్నూర్ లోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందించారు. గ్రామం గుండా నిర్మించి నాలుగు వరుసల రహదారితో పాత పాఠశాల భవనం కోల్పోయామని తెలిపారు. అప్పటినుంచి స్థలం లేక భవనం నిర్మించలేదన్నారు. రోడ్డు విస్తరణలో కోల్పోయిన భవనానికి వచ్చిన నష్ట పరిహారం ఐటీడీఏ ఖాతాలో జమ అయిందని, నూతన పాఠశాల నిర్మాణానికి భూదాత ముందుకు వచ్చినందున వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పెందోర్ మాధవ్‌రావు, కుంరం బాపూజీ, అయ్యుబ్, కోట్నాక దుర్గు, లింగు, వెంకట్ రావు, సంజేరావు, భూమయ్య, రవీందర్ తదితరులు ఉన్నారు.

ప్రమాదపు అంచున పయనం

- బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పాటు చేయని రెయిలింగ్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నిచ్చెన ఎక్కుతున్న గ్రామస్తులు



రెయిలింగ్ లేకుండా ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జి

రెబ్బెన: ఆయా గ్రామాల ప్రజలు వివిధ అవసరాల కోసం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆ మార్గంలో ప్రతీ రోజు ప్రజలు సర్కస్ ఫీట్లు చేస్తూ ప్రమాదకరంగా ప్రయణం సాగిస్తున్నారు. గ్రామం నుంచి పట్టణం వరకు రెండు మార్గాల్లో రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ దూరభారం కావడంతో ప్రజలంతా ప్రమాదకరమైనప్పటికీ నడక దారినే ఎంచుకుంటూ పట్టణానికి వెళ్లి వస్తున్నారు.

రక్షణ లేని వంతెనపై..

మండలంలోని తుంగెడ, మాద్వాయిగూడ, పోతపెల్లి, పాత మాద్వాయిగూడ, జెండాగూడ గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల కోసం ఆయా గ్రామానికి అతి దగ్గర్లో ఉన్న కాగజ్‌నగర్‌కు వెళ్లి వస్తుంటారు. అయితే మాద్వాయిగూడ, పోతపెల్లి, పాత మాద్వాయిగూడ, జెండాగూడ గ్రామాలకు కేవలం 3 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో మాత్రమే కాగజ్‌నగర్ పట్టణం ఉంటుంది. ఆయా గ్రామాలు రెబ్బెన మండలంలో ఉన్నప్పటికీ కాగజ్‌నగర్ పట్టణంతోనే వీరికి సంబంధాలు ఎక్కువగా ఉంటాయి. కాగజ్‌నగర్ పట్టణం నడిచి వెళ్లే దూరంలో ఉండగా రెబ్బెన సుమారు 12 కిలోమీటర్ల వరకు ఉండటంతో అక్కడి గ్రామాల ప్రజలు ప్రతీ అవసరానికి కాగజ్‌నగర్‌కు వెళ్లేందుకు ఇష్టపడుతారు. అయితే మార్గమధ్యలో ఉన్న పెద్దవాగుపై ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పెద్దవాగు నీటిని దారి మళ్లించేందుకు మాద్వాయిగూడకు సమీపంలో నుంచి సుమారు 40 ఫీట్ల లోతుతో కూడిన కెనాల్‌ను తవ్వి దాని ద్వారా వాగునీటిని దారి మళ్లించి ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టారు. వివిధ కారణాలతో ప్రాజెక్టు పనులు నిలిచిపోగా.. వాగు నీటిని మళ్లించేందుకు తవ్విన కెనాల్‌ను అలాగే వదిలేశారు. కెనాల్‌ను దాటేందుకు గతంలో ఐరన్ బ్రిడ్జి ఉండగా అధిక వర్షాల కారణంగా కొట్టుకుపోయింది. దాంతో గ్రామస్తులు కర్రలతో తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగించారు. కర్రల వంతెన స్థానంలో అధికారులు ఇరన్‌తో కూడిన బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. వంతెనకు రక్షణగా రెయిలింగ్ ఏర్పాటు చేయడం మరిచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెయిలింగ్ ఏర్పాటు చేయాలి



జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు కోసం పెద్దవాగు నీటిని దారి మళ్లించేందుకు లోతైన కెనాల్‌ను తవ్వి అలాగే వదిలేశారు. ప్రతీ పనికి కాగజ్‌నగర్‌కు వెళ్తాం. కెనాల్‌పై ఎలాంటి రక్షణ లేకుండా ఉన్న ఇనుప బ్రిడ్జిపై నుంచి వెళుతున్నాం. దానిపై నుంచి వెళ్లే క్రమంలో అదుపు తప్పితే 40 ఫీట్ల లోతులో పడిపోవాల్సిందే.

– తులసీరాం, బీజేపీ నాయకుడు

కూలీ పనులకు వెళ్లక తప్పదు



మాకు రెబ్బెన కంటే కాగజ్‌నగర్ వైపు వెళ్లడం అంటేనే ఎక్కువ ఇష్టం. మా ఊరు నుంచి కాగజ్‌నగర్ 3 కిమీల దూరంలోనే ఉంటుంది. కూలీ పనులకు, ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులు ప్రతీరోజు జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుపై నుంచి నడుచుకుంటూ కాగజ్‌నగర్‌కు పని పోతాం. అదే రెబ్బెనకు పోవాలంటే 12 కిమీ పోవాల్సి వస్తుంది.

– ధర్మాజీ, మాద్వాయిగూడ

కెనాల్ మూసివేయాలి



మావూరి ప్రక్కన జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు కోసం తవ్విన కెనాల్‌ను పూర్తిగా మూసివేయాలి. దాని మూలంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుంది. ఏదైనా పని పడితే కాగజ్‌నగర్‌కు నడుచుకుంటూ వెళ్లి తిరిగి వచ్చే వాళ్లం. కెనాల్ మూలంగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దాని పై నుంచి దాటుతున్నాం. ఏమాత్రం అజాగ్రత్తగా నడిచిన ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.

– శంకర్, మాద్వాయిగూడ

సత్యనారాయణ సేవలు మరువలేనివి



సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కెరమెరి: విద్యార్థులను చీకటి నుంచి వెలుగులోకి తీసుకెళ్లి వారి జీవితాలకు మార్గదర్శం చేసేవాడే గురువు అని, సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివని తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్, మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. బుధవారం మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలలో 14 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అకినాపల్లి సత్యనారాయణకు ఘనంగా వీడ్కోలు పలికారు. 34 సంవత్సరాల ఉపాధ్యాయ జీవితం కెరమెరి మండలంలోని వివిధ పాఠశాలల్లో గడిపారని, మండల, జిల్లా స్థాయిలో అవార్డులు పొందడం ఆయన కృషి, నిబద్ధతకు నిదర్శమన్నారు. కార్యక్రమంలో కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవితేజ, రంగయ్య, సోము, కిషన్, మాజీ సర్పంచ్ రజిత, పటేళ్ల శంకర్, మెండయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి: గురుకులంలో సీటు సాధించిన గొల్లగూడ(కె) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు కేశవ్‌రావు, అఖిల్ బుధవారం అభినందించారు. పాఠశాలలో నాలుగో తరగతి పూర్తి చేసుకున్న జాడి మన్విత, లెంకటి హర్షితలు ఇటీవల నిర్వహించి గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి సీటు సాధించారని తెలిపారు. ఇద్దరికి రెబ్బెన మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు లభించిందన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ జాడి తిరుపతి, లెంకటి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కౌటాల: మండలం ముత్తంపేటలోని బస్టాండ్ ఏరియా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. బుధవారం నిరుపయోగంగా ఉన్న చేతి పంపు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా బస్టాండ్ ఏరియాలోని చేతి పంపు పని చేయడం లేదన్నారు. మిషన్ భగీరథ నీరు సైతం సక్రమంగా రావడం లేదన్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్థానికంగా బోర్లు ఉన్న వారిని నీళ్లు అడిగితే ఇవ్వడం లేదని వాపోయారు. కనీసం పేద ప్రజలకు తాగునీరు అందించలేని అధికారులు, పాలకులు ఓట్లు వేయమని అడగడానికి రావొద్దన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న అధికారులకు ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి తమకు తాగునీటి వసతి కల్పించాలని కోరారు.



పొదలతో ప్రమాదం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్–లోడుపల్లి ప్రధాన రహదారిలోని బొక్కివాగు వంతెన మూల మలుపు వద్ద రోడ్డుపై పొదలు కమ్ముకున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుని ఆనుకుని ఉన్న పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ

కెరమెరి: మండలంలోని అన్ని పాఠశాలల్లో బుధవారం ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. మార్కుల ప్రోగ్రెస్ కార్డులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందజేశారు. మండలంలో మొత్తం 98 ప్రభుత్వ ప్రైవేట్ ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 5,730 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గతంలో ప్రింటెడ్ ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వగా.. మూడేళ్ల నుంచి ఆన్‌లైన్ కార్డులు అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డబ్బా నుంచి బెజ్జూర్ వైపు వెళ్తున్న బొలెరో వాహన, దహెగాం నుంచి కౌటాలకు బైక్‌పై వారిని ఎదురుగా ఢీకొట్టింది. బొలెరో వాహనం రాంగ్ రూట్లో అతివేగంగా రావడంతో అదుపు తప్పి వాహనాన్ని ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న దహెగాం మండలానికి చెందిన పెద్దల ప్రసాద్, బోరెం పున్నమ్‌లకు గాయాలు కావడంతో ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. బొలెరో డ్రైవర్ మద్యం సేవించి ఉన్న ట్లు స్థానికులు తెలిపారు. బొలెరో డ్రైవర్ డోంగ్రె నాగార్జున్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు.

కౌటాల ఎస్సైగా విజయ్

కౌటాల: కౌటాల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం గుంపుల విజయ్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని కెరమెరిలో విధులు నిర్వహించి కౌటాలకు ఆయన బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. కౌటాలలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరు సహకరించాలన్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన మధుకర్ కెరమెరి ఎస్సైగా బదిలీపై వెళ్లారు.

కెరమెరి ఎస్సైగా మధుకర్

కెరమెరి: కెరమెరి ఎస్సైగా నాయిని మధుకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన గంపుల విజయ్ కౌటాల మండలానికి బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో కౌటాల మండలంలోని విధులు నిర్వహించిన మధూకర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. పలువురు నాయకులు ఎస్సైని సన్మానించారు.

లబ్ధిదారుల ఎంపికపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: మండల కేంద్రంలో రైతువేదికలో బుధవారం ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా లబ్ధిదా రుల ఎంపిక, విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమా ర్ వివిధ అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇల్లు క మిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. లబ్ధిదారుల ఎంపిక, ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన నిబంధనలు, విడతల వారీగా నిధుల విడుదల, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఖాజా ఆజీజుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు అన్నివేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. గోలేటి గ్రామ పంచాయతీలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా నిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు ఆపద సమయంలో తప్పకుండా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ సర్పంచ్ సుమలత, మల్లయ్య, ఆసీఫ్, దయాకర్ పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రాలు చూపుతున్న వెంకటేశ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బూర్గుడ సమీపంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో అదనంగా రూ.15 నుంచి 20 వేలు వసూలు చేస్తున్నారని, తళ్ళపల్లి వెంకటేశ్ బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఈడీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదవుతున్నానని, ఈనెల 13లోపు 4 సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని కళాశాల కరస్పాండెంట్ తెలపడంతో పరీక్ష ఫీజు చెల్లించానని, నాకు 22వ తేదీన ప్రిన్సిపాల్ ఫోన్ చేసి పరీక్ష ఫీజు కట్టాల్సిన డేట్ అయిపోయింది. అని నేను కట్టిన ఫీజు నాకు తిరిగి ఫోన్ పే చేశారు. మీరు అటెండెన్స్ ఫీజు రూ. 10 వేలు చెల్లిస్తేనే పరీక్ష రాస్తారు లేకుండా రాయనివ్వామని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాతో పాటు కళాశాలలో చాలా మంది విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేశారని ఆరోపించారు.

పేద విద్యార్థులకు అండగా ఎస్‌బీఐ



సైకిళ్లు అందజేస్తున్న రీజినల్ మేనేజర్

బెజ్జూర్: పేద విద్యార్థులకు ఎస్‌బీఐ అండగా నిలుస్తుందని రీజినల్ మేనేజర్ రితీష్ కుమార్ గుప్తా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సలుగుపెల్లి జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌లో భాగంగా మారుమూల గిరిజన గ్రామాన్ని ఎంచుకొని పేద విద్యార్థులకు వీటిని అందించడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌లు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు సైకిళ్లను అందజేయడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థినిలకు సైకిళ్లను అందజేశారు. ఎస్‌బీఐ కౌటాల బ్రాంచ్ మేనేజర్ విష్ణు, సిబ్బంది సంతోష్, నరేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రెబ్బెన: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడికి నిరసనగా బుధవారం రాత్రి మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భజరంగ్ దళ్, హిందూ ఉత్సవ సమితీ సభ్యులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సౌందర్య, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, లావుడ్య రమేశ్, దేవాజీ, రాము, వినోద్ జైస్వాల్ పాల్గొన్నారు.



వాంకిడిలో..

వాంకిడి: జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా బుధవారం మండల కేంద్రంలో హిందూ సంఘాల నాయకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ముష్కరులు కాల్పులు జరపడం హేయమైన చర్య అన్నారు. హనుమాన్ మందిర్ నుంచి శివాజీ విగ్రహం వరకు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఉగ్ర దాడి దుర్మార్గమైన చర్య

రెబ్బెన: జమ్మూకశ్మీర్‌లోని పహాల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిగిన దాడి దుర్మార్గమైన చర్య అని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో అన్నారు. ఈ దాడిని టీబీజీకేఎస్ పూర్తిగా ఖండిస్తోందన్నారు. దొంగచాటుగా వచ్చి చంపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. భారతదేశంలో ఇలాంటి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను నడిరోడ్డుపై శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతి

రెబ్బెన: గ్రామ పంచాయతీల వారీగా నిజమైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని డీపీవో భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు, పంచాయతీ కార్యదర్శులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మండలంలోని అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా నుంచి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం నిజమైన లబ్ధిదారులను వెంటనే ఎంపిక చేయాలని సూచించారు. పంచాయతీ వారీగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామంలో ఆక్టివ్‌గా ఉండే సభ్యులతో కూడిన ఇందిరమ్మ కమిటీ వెంటనే లబ్ధిదారుల ఎంపిక చేపట్టి జాబితాను అందించాలని సూచించారు. వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టేలా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడూ లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకునేలా కృషి చేయాలని సూచించారు.సమావేశంలో ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో వాసుదేవ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.